కథ

# అల్లరిపాప

**- వసుంధర**

ఆఫీసు నుంచి సాయంత్రం ఇల్లు చేరేసరికి పరిస్థితి చాలా గంభీరంగా ఉంది. రోజూ పరుగున వచ్చి పలకరించే మా ఏడేళ్ళ పాప నా కంటికి కనపడలేదు. పాప వెనుకే వచ్చి నవ్వుతూ నిలబడి మా యిద్దర్నీ చూసి పరవశించే శ్రీమతీ కనబడలేదు.

కుర్చీలో కూర్చుని బూట్లు విప్పుకుంటూ, "సరూ!" అన్నాను. కొద్ది క్షణాల్లో శ్రీమతి నాముందు ప్రత్యక్షమై, "వచ్చేశారా?" అంది.

ఏదో జోక్ వేద్దామనుకుని శ్రీమతి వంక చూసి ఆగిపోయాను. ఆమె ముఖం ఏదో లాగుంది. కళ్ళు మాత్రం తెగ ఏడ్చినట్లు ఎర్రగా ఉబ్బి ఉన్నాయి.

"ఏం జరిగింది సరూ!" అన్నాను అనునయంగా, ఆశ్చర్యంగా.

శ్రీమతి వెంటనే భోరున ఏడ్చేసింది. జరిగిన విశేషం ఆమెనుండి తెలుసుకుందుకు నాక్కాసేపు పట్టింది.

శ్రీమతి పాపను కొట్టింది. మా యింట్లో పాప దెబ్బలు తినడం అదే మొదటిసారి. కానీ ఈ సందర్భం ఏదో ఒక రోజున వస్తుందని మా యిద్దరికీ తెలుసు.

పాపను మేము అల్లారు ముద్దుగా, గారంగా పెంచుతున్నాం. ఆ గారాబం, దాన్ని పెంకిదాన్ని చేసింది. మేమెంత చెప్పినా ఆ పెంకితనం పోవడం లేదు.

పాపకు కోపం వస్తే బట్టలు చింపేస్తుంది. చేతిలో ఏముంటే అది విసిరేస్తుంది. గట్టిగా అరుస్తుంది. మాటలనడంలో చిన్నా పెద్దా తేడా చూపించదు.

నేను, శ్రీమతి - ఇద్దరం శాంత స్వభావులం. మరి పాపకీ పోలిక ఎక్కణ్ణించి వచ్చిందో తెలియకుండా ఉంది.

ఉదయం ఓ పట్టాన లేవదు. లేచేక ఓ పట్టాన స్నానం చేయదు. స్కూలున్న రోజున దాన్ని తెమిల్చి పంపడం శ్రీమతికి పెద్ద సమస్య.

అయితే పాప అల్లరి, పెంకితనం మాకు ముచ్చటగానే ఉండేవి. కానీ రెండు నెలల క్రితం మా పక్కవాటాలో అద్దెకు దిగిన కమలాకరం, పద్మావతి దంపతుల కారణంగా మాకిబ్బంది వచ్చింది. వాళ్ళబ్బాయి తొమ్మిదేళ్ళ రఘు, అమ్మాయి ఏడేళ్ళ అలివేణి ఇద్దరికిద్దరూ బుద్ధిమంతులు. తల్లికి పనుల్లో సాయం చేస్తూ, శ్రద్ధగా చదువుకుంటూ, క్రమశిక్షణలో తమకు తామే సాటి అని పేరు తెచ్చుకున్నారు. అంతవరకూ బాగానే ఉంది. అలివేణిదీ పాపదీ ఒకటే వయసు కదా - మా వీధిలో ఆ యిద్దరికీ పోలిక వచ్చి మా పాప చెడ్డపిల్ల అయింది. అదీ శ్రీమతి బాధ!

అలివేణి, పాప కలిసి ఆడుకునే వారు. ఆటల్లో పిల్లలకు గొడవలు రావటం సహజం. అలా జరిగినప్పుడు పాప వెంటనే అలివేణిని తిట్టడమో, కొట్టడమో చేసేది. అలివేణి మాత్రం, "జరిగింది పెద్దవాళ్ళకు చెబుదాం. తప్పెవరిదో వాళ్ళు చెబుతారు" అనేది. అంత ఓపిక మా పాపకెక్కడిది?

అలివేణి తరచుగా పాపను గురించి శ్రీమతికి ఫిర్యాదు చేసేది. శ్రీమతి వినీ విననట్లూరుకునేది. ఒకోసారి అలివేణినే తప్పు పట్టడానికే ప్రయత్నించేది. అయితే ప్రతీ ప్రశ్నకీ అలివేణి దగ్గర సమాధానముండేది.

శ్రీమతి నాకు జరిగింది చెప్పుకుని, "ఆ పిల్ల చాలా తెలివైనది" అంటూండేది. ఒక తల్లి తన బిడ్డ వయసున్న మరో తల్లి బిడ్డ తెలివిని మెచ్చుకుందంటే - ఆమె అభిప్రాయంలో ఆ తెలివి తెలివి కాదు. శ్రీమతి అలివేణిని నేరస్థురాలుగా భావిస్తోందని గ్రహించాను.

అలివేణి నిజంగానే తెలివైనది. ఇదివరలో పాప వీధిలో ఏ అల్లరి చేసినా, ఎవరి పిల్లల్ని కొట్టినా మా దాకా వచ్చేది కాదు. ఇప్పుడు అంతా శ్రీమతికి ఫిర్యాదు చేస్తున్నారు. క్రమంగా పాప ఒంటరిదైపోయిందా వీధిలో..

ఒకరోజు పద్మావతి శ్రీమతిని కలుసుకుని - "మీ పాప అందర్నీ నోటికెంత మాటలొస్తే అంతా అనేస్తోందిట. ఈ వయసులో అదుపు చేయకపోతే ఇక ఆ అలవాటు పోదు" అని చెప్పింది. శ్రీమతికేమనాలో తెలియక, "ఇంట్లో అది బుద్ధిగానే ఉంటుంది" అని ఊరుకుంది. కానీ పద్మావతి ఊరుకోక, "మన పిల్ల గురించి ఇతరులేం చెప్పినా నమ్మకూడదనిపిస్తుంది. అదే పిల్లల్ని పాడు చేస్తుంది. మేమూ మా పెద్దబ్బాయితో అనుభవించాం. వాడికి విపరీతమైన గారం చేస్తే ఉత్త అల్లరి వెధవకింద తయారయ్యాడు. ఎవరు ఫిర్యాదు చేసినా నమ్మేవాళ్ళం కాదు. వాడికో చెల్లాయి పుట్టింది. దాన్నీ వాడేడిపిస్తూంటే మేము కలగజేసుకుని నెమ్మదిగా వాడికి క్రమశిక్షణ అలవాటు చేశాం. వాడితో పోటే రెండో దానికీ అలవాటయింది. ఒకే పిల్ల ఉంటే - తల్లిదండ్రులకి ఆ పిల్ల అల్లరి తెలియదు" అంది.

అప్పుడు, "క్రమశిక్షణ నేర్పడానికి మీరేం చేశారు?" అని శ్రీమతి పద్మావతిని కుతూహలంగా అడిగింది.

"ఒకసారి అల్లరికి అలవాటుపడ్డ పిల్లలకి వేరే ఉపాయం లేదు. కొన్నాళ్ళపాటు మనసుకు కష్టంగానే ఉంటుంది కానీ తప్పదు. నాలుగు తగిలిస్తూండడమే" అంది పద్మావతి.

"ఆ పద్మావతికి మన పిల్ల దెబ్బలు తినాలని కోరిక" అని ఆరోజు శ్రీమతి నాకు బాధగా చెప్పుకుంది.

కొట్టకుండా పాపను మంచి మార్గంలో పెట్టడానికి నేనో ఉపాయం ఆలోచించాను. రోజూ దానికి కథలు చెప్పేవాణ్ణి. ఆ కథల్లో మా పాపలాంటి అల్లరి పిల్ల, అలివేణి లాంటి మంచి పిల్ల ఉంటారు. చివరకు మంచి పిల్ల చేతిలో అల్లరి పిల్ల భంగపడుతుంది.

మొదటిరోజు కథ చెప్పాక, "కథ బాగుంటే రోజూ ఇలాంటి కథలు చెబుతాను" అని పాపకు చెప్పాను.

పాప ఉత్సాహపడి, "రోజూ చెప్పు. కానీ కథలో మంచి పిల్లకు శాంత అని కాక నా పేరెట్టు. అల్లరి పిల్లకు చండి అని కాక అలివేణి అని పేరు పెట్టు" అంది.

"మరి నువ్వు నిజంగా శాంత అంత మంచి పిల్లవేనా?" అన్నాను.

"ఓ!" అంది పాప కళ్ళు చక్రాల్లా తిప్పుతూ. నాకు ముచ్చటేసింది.

రెండురోజుల్లోనే నేను అసలు విషయం గ్రహించాను. నా కథలు పాపను మార్చడం లేదు. అలివేణి పట్ల దానికున్న కసి తీర్చుకుందుకు సహకరిస్తున్నాయి.

"నువ్వు చాలా అల్లరి చేస్తున్నావు. అలివేణి పేరే మంచి పిల్లకు పెట్టి నీ పేరు అల్లరి పిల్లకు పెట్టేస్తాను" అని ఒకరోజు బెదిరించాను. అది ఏడుస్తూ కూర్చుంటే చూడలేక దానిష్టప్రకారమే కథను చెప్పాను.

"కథల ప్రభావం క్రమంగా ఉంటుంది. కొన్నాళ్ళపాటీ విధంగా కథలు చెప్పి చూస్తాను" అన్నాను నేను శ్రీమతితో. శ్రీమతికది నచ్చటంతో నిన్నటిదాకా అదే చేశాను.

ఈరోజు పాప స్కూల్నించి రాగానే తిండి దగ్గర పేచీ వచ్చింది. అడిగిన కూర లేదని పెద్దపెట్టున గొడవ ప్రారంభించింది. ఆ సమయంలో మా యింటికి వచ్చిన పద్మావతి, "తప్పమ్మా! అప్పుడే మా అలివేణి భోంచేసి ఆటలకు వెళ్ళిపోయింది. నువ్వు కూడా అమ్మేం పెడితే అది తినేయడం అలవాటు చేసుకోవాలి" అంది పాపతో.

"మధ్య నీకెందుకే ముండా!" అంది పాప వెంటనే.

అప్పుడు శ్రీమతిక్కలిగిన ఆవేశమింతా అంతా కాదు. పాపను చావబాది పద్మావతికి క్షమార్పణ చెప్పుకుంది. పాప చేత చెప్పించింది.

"చిన్నపిల్ల. తప్పొప్పులు దానికేం తెలుస్తాయి?" అని వెళ్ళిపోయింది పద్మావతి.

"నంగనాచిలా అలాగంది కానీ - అలాంటప్పుడు కలగజేసుకుంటే మన పిల్ల నోరు మంచిది కాదని తెలుసు కదా - తనెందుకు రావాలి?" అంది శ్రీమతి.

పిల్లను కొట్టిన బాధతో అలాగన్నప్పటికీ పాప ప్రవర్తనలో లోపముందని శ్రీమతికీ తెలినట్లే ఉంది. నేనామెననునయించి, "ఇప్పుడు మనం పాపను బ్రతిమాలవద్దు. నేను పాప దగ్గరకువెళ్ళి నిన్ను సమర్థిస్తాను. ఇకమీదట ప్రతి అల్లరి పనికీ యిలాగే దెబ్బలు పడతాయన్న భావం దానిలో కలిగిస్తాను" అన్నాను.

పాపను పలకరించగానే అది తల్లిపై నేరం చెప్పడానికి ప్రయత్నించింది. నేను మంచిగా అభినయిస్తూనే శ్రీమతిని సమర్థించాను. పాప బాగా భయపడింది. ఆ తర్వాత వారం రోజులపాటు బుద్ధిగా వుంది. తర్వాత కొంచెంకొంచెం అల్లరి మొదలెట్టింది. తల్లి బెదిరిస్తోంది తప్ప కొట్టదని రూఢి కాగానే అది క్రమంగా ఎప్పటి స్థాయికి చేరుకుంది.

"అప్పుడప్పుడు కాస్త చేయి చేసుకో" అన్నాను శ్రీమతితో.

"అనడం సులభమే మీకు - మీరోసారి కొట్టండి" అంది శ్రీమతి.

అది నావల్ల కాదని నాకు తెలుసు. అందుకే, "ఆడపిల్లమీద తండ్రి చేయి చేసుకోకూడదు" అంటూ

సెంటిమెంటు సాయం తీసుకున్నాను.

"బిడ్డమీద కన్నతల్లి చేయి చేసుకోలేదు" అంది శ్రీమతి.

కొడితే పాప బాగుపడుతుందని ఋజువయింది. కానీ అది మావల్ల కావడం లేదు. అందుకని నేనొక రోజు పుస్తకాల షాపులన్నీ తిరిగి - పిల్లల్నిపెంచడం మీద ఓ మనస్తత్వ శాస్త్రవేత్త రాసిన పుస్తకానికి తెలుగు అనువాదం కొన్నాను. శ్రీమతి ఆ పుస్తకం చదివి అందులోని ఉపాయాలనొకటొక్కటిగా పాపపై ప్రయోగించసాగింది. ఒక్కటీ పనిచేయలేదు. పైగా పాప ఒక రోజున - "అమ్మా! రేపు నాకు సినిమా చూపించొద్దు" అంది.

శ్రీమతి ఆశ్చర్యపడి, "సినిమా చూపిస్తానని నీకెలా తెలుసు?" అంది.

రేపు పాపకు స్కూలు లేదు. నాకాఫీసుంది. శ్రీమతి దాన్ని సినిమాకు తీసుకుని వెళ్ళి అక్కడ మర్చిపోయి వచ్చేస్తుంది. నేనూ సెలవు పెట్టి సినిమా హాల్లోనే ఉండి పాపను రహస్యంగా గమనిస్తుంటాను. దాన్ని మార్చడానికదే ఉపాయం.

పాప వెంటనే, "మనింట్లో ఓ పుస్తకముంది. అందులో చెప్పిన ప్రకారం నువ్వు అన్నీ నామీద చేస్తున్నావు. ఆ ప్రకారం రేపు నన్ను సినిమాకు తీసుకెడతావు. కానీ నాన్నకెన్నో సెలవుల్లేవు. సినిమాలకు రాత్రిళ్లైనా వెళ్ళవచ్చు. నాన్న సెలవు పెట్టే మాటైతే జూకి వెడదాం. నాకు జూ చూడాలనుంది" అంది.

శ్రీమతి వెంటనే పాపను ముద్దు పెట్టుకుని - "నీదెంత తెలివే?" అంది. నేను మాత్రం తెల్లబోయాను. ఆ పుస్తకంలోని ఉపాయాలెందుకు పనిచేయడంలేదో అర్థమైనా - ఏడేళ్ళ పాప - ఆ పుస్తకాన్ని చదివి అర్థం చేసుకోవడం ఓ పెద్ద విశేషం!

ఇక యిలా లాభం లేదనుకుని - ఈసారి ఓ ఇంగ్లీషు పుస్తకం కొన్నాను. పాపకంత ఇంగ్లీషు అర్థం కాదు. శ్రీమతికీ ఆ పుస్తకం పూర్తిగా అర్థం కాకపోవడంతో నేనే పుస్తకం పూర్తిగా చదవాల్సి వచ్చింది. అందులో ఓ



ఉపాయం నాకు నచ్చింది.

ఆ ప్రకారం ఒకరోజు పాపతో, "నువ్వు చాలా తెలివైనదానివి. నీ తెలివి అల్లరికే ఉపయోగపడుతుందని అంతా అనుకుంటున్నారు. బాగా చదువుకుని అలివేణి కంటే ఎక్కువ మార్కులు తెచ్చుకో. మంచి మార్కులు తెచ్చుకునే పిల్లలంటే అందరికీ యిష్టమే కదా! అందుకని నువ్వల్లరి చేసినా ఎవ్వరూ ఏమీ అనరు" అన్నాను.

అలివేణి పేరు చెప్పి చదువుకు ప్రోత్సహించడం వల్ల పాపకి చదువు బాగా వస్తుంది. చదువు దృష్టిలో దాని అల్లరి తగ్గిపోవచ్చు.

"మంచి మార్కులు రావాలంటే ఏం చేయాలి?" అంది పాప.

"బాగా చదవాలి."

"నేను బాగానే చదువుతున్నాను...."

"చదువంటే పుస్తకం ముందు కూర్చోడం కాదు. ఏకాగ్రత వుండాలి."

"నాకుంది ఏకాగ్రత" అంది పాప వెంటనే.

ఏకాగ్రత అంటే పాపకు వివరించి, ఉదాహరణగా అర్జునుడి కథను చెప్పి, "నువ్వు చదువుకుంటున్నప్పుడు నేను, అమ్మ నీకు వినపడేలా మాట్లాడుకుంటాం. మా మాటలు నీకు వినపడకపోతే నీకు ఏకాగ్రత ఉన్నట్లు" అన్నాను.

పాప అంగీకరించింది. ఆ రోజు నుంచీ పాప చదువుకునే సమయంలో - అదే రోజున చేసిన వెధవ పనులన్నీ ఏకరువు పెట్టి అదెలాగుంటే మేము సంతోషిస్తామో నేను, శ్రీమతి అది వినేలా చెప్పుకునేవాళ్ళం.

మొదట్లో అభ్యంతరపెట్టినా పాప క్రమంగా ఏకాగ్రత పేరు చెప్పి మా మాటలు సహించడం నేర్చుకుంది.

ఇందువల్ల రెండు ప్రయోజనాలు. మా మాటలకి రియాక్టయితే ఏకాగ్రత లేదంటామని మాట్లాడదు కాబట్టి అది వినేలా మేము దాన్ని విమర్శించగలగడం మొదటి ప్రయోజనం. పాప మీద మా మాటల ప్రభావముంటే అది రెండో ప్రయోజనం.

ఈ ప్రయోజనాల విషయమెలాగున్నా పాపకు ఈ సారి పరీక్షల్లో గతంలోకంటే తక్కువ మార్కులు వచ్చాయి. అలివేణితో పోల్చితే ఇక చెప్పనవసరం లేదు.

"నేను కష్టపడి చదివాను" అంటుంది పాప.

"దానిముందే మనం దాన్ని నానా మాటలూ అంటూంటే - ఇంక దానికి చదువేమెక్కుతుంది? తప్పంతా మీది. తీరి కూర్చుని దాని చదువు పాడు చేశారు" అంది శ్రీమతి.

నాక్కోపం వచ్చింది. పాపకేసి తిరిగి - "అంటే నువ్వు రోజూ మా మాటలు విన్నావు తప్ప - చదువుకోలేదన్నమాట. అంతేనా?" అన్నాను.

పాప మాట్లాడలేదు.

"వింటే విన్నావులే. దానికి నేనేమీ అనను. కానీ మా మాటల వల్లైనా నీ బుద్ధి మారలేదేం? నీ అల్లరి తగ్గలేదేం?" అన్నాను.

'మీరేం మాట్లాడుకున్నారో నాకేం తెలుసు? నేను నిజంగానే ఏకాగ్రతతో చదువుకున్నాను" అంది పాప.

అప్రయత్నంగా ఫక్కున నవ్వింది శ్రీమతి.

నాకు ఏడవాలో నవ్వాలో తెలియలేదు. పాప నిజం చెబుతోందో, అతి తెలివికి పోతోందో అర్థం కాక, ఒకసారి అల్లరి బాగా అలవాటైన పిల్లలకి వేరే ఉపాయం లేదు. కొన్నాళ్ళపాటు మనసుకి కష్టమనిపించినా తప్పదు. నాలుగు తగిలిస్తూండాలి" అన్న పద్మావతి మాటల్లో నిజముందని మాత్రం గ్రహించగలిగాను.

అప్పుడు నేను సైకాలజీ పుస్తకాలు పక్కన పెట్టి - దండం దశగుణభవేత్ అనుకున్నాను.

ఈ నిర్ణయానికి వచ్చేక నేను పాపను అంతగా దండించనవసరం లేకపోయింది. నాకు నిజంగా కోపం వస్తోందనీ, నేను నిజంగా కొడతాననీ నమ్మకం కుదిరేక - దండిస్తానంటేనే భయపడి అది తన ప్రవర్తనను సరిదిద్దుకోసాగింది.

మనసుకు కష్టంగానే ఉన్నా - సున్నిత మనస్తత్వం గల తలిదండ్రులు తెలుసుకోక తప్పని కఠోర సత్యమిది!